

## 3

# గోధుమరంగు ఆట

భగవంతం

**అర్ధరాత్రి బస్సు ప్రయాణం... వయా భద్రాచలం... చింతూరు... మోతుగూడెం... సీలేరు... చింతపల్లి... అట్నుండి ఏడో నెంబర్ బస్సులో కానీ, ఇట్నుండి పదమూడో నెంబరు బస్సులో కానీ భగవంతం వస్తాడేమోనని-**

హోటల్లో గోధుమరంగు స్మృతిని మాత్రం మిగుల్చుకున్న ఖాళీ కప్పులోని శూన్యం ముందు కూర్చొని ఎదురుచూసే-

ఆయన్ని కలవడానికి మా ఊరి నుండి ఇంతకన్నా కళాత్మకమైన దారి మరొకటి లేదు.

రాత్రంతా దట్టమైన అడవులవైపు సాగిపోతూ- తెల్లారేసరికి గిరిజనగూడేల చివరి పొగమంచును చీల్చుకుపోతూ- మధ్యాహ్నమంతా కొండమలుపుల ఎండనీడల్లో మెలికలు తిరుగుతూ సాగే ప్రయాణం.

బస్సు ఎక్కినప్పటి నుండే ఆయన ముందు కూర్చున్న భావనని కలిగిస్తోన్న ప్రయాణం.

ఘాటీరూటు కాబట్టి ఓ గంట ఆలస్యమైనా రేపు సాయంత్రానికల్లా హోటల్‌కి చేరుకొని ఆయన్ని కలుసుకోవచ్చు.

గోధుమరంగుకి అవతల ఆయన- ఇవతల నేను. ఊహించుకుంటేనే భలే వేడుకగా ఉంది.

ఆయనతో చాలా విషయాల గురించి చర్చించాలి. ఒకటి రెండు మెలితిప్పిన అనుభవాల గురించి పంచుకోవాలి. నాలుగైదు చమత్కారాల గురించి చెప్పి నవ్వుకోవాలి.

ఒకే ఒక ప్రశ్నకు ఎలాంటి జవాబు చెబుతాడో చూడాలి.

లయబద్ధమైన శబ్దం వల్ల ఆలోచనల్లోంచి బయటికొచ్చి బస్సు కిటికీలోంచి అవతలికి చూశాను.

బస్సు భద్రాచలం బ్రిడ్జిని దాటుతోంది. కిటికీలోంచి అవతలికి చూశాను. బ్రిడ్జి అవతలి చీకట్లో దూరంగా గుడికి అలంకరించిన విద్యుత్‌దీపాల కాంతి ప్రతిబింబం కదలాడుతుండగా మలుపు తిరుగుతోన్న గోదావరి నీళ్లు కనిపించాయి.

నీటితో తయారయ్యే విద్యుత్ ద్వారా వెలుగుతోన్న దీపాలకాంతి నీటిమీద పడి బాటసారికి చీకట్లో తిరిగి నీటిని చూపిస్తోంది. దృశ్య చమత్కారానికి పరవశిస్తూ కళ్లు మూసుకున్నాను.

కొన్నిక్షణాల తర్వాత- 'ఈ రాత్రి ఈ నదీప్రవాహాన్ని నువ్వు దేనితో పోలుస్తావ్...?' చటుక్కున నా లోపలి నుండి ఏదో అడిగింది.

కాసేపటికి- 'ఎక్కడి నుండి ఆ భావం కీర్తనలోకి వచ్చి చేరిందో తెలియక భక్త రామదాసు కంట్లోంచి కారిన ఆనందబాష్పంతో...' సమాధానం లభించింది.

బస్సు కాసేపటికి బస్టాండు ప్రాంగణంలో ఆగింది. డ్రైవరు, కండక్టర్‌తో పాటు బస్సు దిగి మూసేసిన ఆర్టీసీ క్యాంటీను బయట ఉన్న చిన్న టీకొట్టు దగ్గరికి వెళ్లాను.

అందరూ టీలు తాగాక బస్సు తిరిగి అడవుల్లోని ఆకుల కింది చీకటివైపు బయలుదేరింది.

*

దట్టమైన అడవిలోంచి వేగంగా వెళ్తోంది బస్సు. టైం రాత్రి మూడుగంటలు దాటి ఉండొచ్చు.

డ్రైవరు, నేను మాత్రమే మెలకువగా ఉన్నట్లు తలతిప్పి బస్సునంతా పరికించిన తర్వాత గ్రహించాను.

కండక్టర్ కూడా మంకీ క్యాపు పెట్టుకున్న తలతో గుర్రుపెట్టి నిద్రపోతున్నాడు. అతడి వెనుక సీటే నాది.

చుట్టూ ఉన్నవాళ్లంతా నిద్రపోవడం వల్ల కలిగిన మానవ నిశ్శబ్దం నన్ను ఇంకో ప్రపంచంలో మేల్కొనేలా చేసింది. నా పక్కసీటు కూడా ఖాళీగానే ఉండడంతో రెండు కాళ్లు శరీరం కుడిపక్కకు మడిచి రిలాక్స్‌డ్‌గా కిటికీ వైపు వాలి చాలాసేపట్నుండి అడవి వైపు చూస్తున్నాను.

చీకటితో కలిసి... ఊరికే అట్లా ఉన్న చెట్లన్నీ వేగంగా వెనక్కి వెళ్లిపోతున్నాయి. నేను ముందుకి వెళ్లడం వల్లే అవి వెనక్కి వెళ్తున్నాయన్న భావన చలనంలోని సౌందర్యరహస్యాన్ని చెబుతున్నట్లుగా ఉంది.

అయితే... ఎందుకీ చలనం...? దేన్ని అందుకోడానికి ఈ ప్రయాణం...? ఏది ప్రేరేపించడం వల్ల ఈ కదలిక...? ఏ ఖాళీల వల్ల ఈ పూరించుకోవడాలు...?

ప్రశ్నలు నాసికారంధ్రాల చివరి నుండి పుడుతున్నట్లుగా అనిపించాయి. అంత బస్సు వేగంలోనూ ఉచ్ఛ్వాసనిశ్వాసల నడక నెమ్మదిగా కొనసాగుతోంది.

శ్వాస తీసుకోవడంలోని సుఖం మొదటిసారి అనుభవంలోకి వస్తున్నట్లుగా ఉంది.

ఈ సుఖానికీ పై ప్రశ్నలకీ ఏమైనా సంబంధం ఉండి ఉంటుందా?

సుఖం జవాబుల వల్ల కాకుండా ప్రశ్నల వల్ల కూడా కలుగుతుందా...?

మనిషి గమనించినా గమనించకపోయినా అతడి చుట్టూ నిరంతరాయంగా ఏదో జరిగిపోతూ ఉందని గాఢంగా అనిపించింది. దాన్ని పట్టుకోవాలి...

బస్సు రోడ్డు మలుపేదో తిరుగుతోంది. శరీరం పూర్తిగా కిటికీవైపు ఒరిగింది.

చాలా పెద్ద మలుపు. అంత పెద్ద మలుపులోనూ డ్రైవర్ బస్సు వేగాన్ని ఏమాత్రం తగ్గించకపోవడం వల్ల శరీరం గాల్లో తేలుతున్నట్లుగా వుంది.

బస్సు సున్నా అనే అంకె మీద గుండ్రంగా తిరుగుతున్న భావన కలిగింది.

ఉన్నట్లుండి బస్సు వేగం అమాంతం తగ్గిపోతూ మలుపులో క్రీ...చ్...మని బ్రేకు పడుతూ ఆగిపోయింది.

నిద్రపోతున్న వాళ్లలో కొందరి తలలు ఒక్కసారి ముందుకి కదిలి తిరిగి వెనక్కి సర్దుకున్నాయి- మూలిగిన పెదవులతో...

బస్సుకి ఏదో అడ్డం వచ్చినట్లుంది. డ్రైవర్‌కి దగ్గర్లో ఉన్న సీటు కాబట్టి కిటికీ పక్కనుండి కుడివైపుకు జరిగి బస్సు ముందున్న అద్దాల్లోంచి బయటికి చూశాను.

ఒళ్లంతా చిక్కని పాలతో నిండిపోయినట్లున్న తెల్లని ఆవు ఒకటి రోడ్డు దాటుతోంది.

బస్సులైట్ల వెలుగులో అది రోడ్డు దాటుతూ ఒకసారి తలతిప్పి బస్సువైపు చూసినపుడు, ఆ ఆవు ముఖంలో అడవిలోని అమాయకత్వం మొత్తం ముద్దగా ఒక్క చోట కనిపించినట్లయింది.

ఈ రాత్రి అది ఎక్కడినుండి ఎక్కడికి పోవడానికి రోడ్డు దాటుతోందో...? అడవి శరీరంలోని చిన్న అవయవంలా రోడ్డు దిగి చెట్లలోకి అదృశ్యమైంది అది. తిరిగి బస్సు కదిలింది.

కూర్చున్న సీటు అంచులోంచే తలతిప్పి వెనక్కి చూశాను. వెనుక బస్సు అద్దాల కవతల చీకట్లలో తన ఆత్మకథలో ఆవు ప్రస్తావనను కూడా తీసుకురావడంలో లీనమై నట్లు కనిపించింది అడవి.

పావుగంటలో అంతా సద్దుమణిగి తిరిగి అందరూ గాఢనిద్రలోకి జారి పోయారు నిశ్శబ్ద పెదవులతో...

నేను మళ్లీ కిటికీ పక్కకు చేరుకొని బయటికి చూశాను.

అడవిలోని కొలనులోకి రాత్రెప్పుడో కప్ప దూకినపుడు ఏర్పడ్డ వలయాల్లా ప్రశ్నలు.

హోటల్లో ఆయన ఎదురుచూడడంలోని ఆంతర్యమేమిటో?

శరీరంలోని ఏ చెట్టు ఏ మట్టి ఏ ఖనిజం ఏ కణం ఏ శిలాద్రవం అలా 'ఎదురు చూడడం' అనే భావనని ప్రేరేపిస్తుందో?

సమాధానం ఆయన్నే అడగాలి.

ఎదురుచూపుల కళ్ల కింది నుండి ఏం చెబుతాడో చూడాలి.

ఇది అడిగినా అడక్కపోయినా ఆ ఒక్క ప్రశ్నని మాత్రం ఖచ్చితంగా అడగాలి.

కాఫీలు తాగే చేతివేళ్ల చివర్లలోంచి ఏ జవాబు చెబుతాడో చూడాలి...

ఆయన సమాధానాలు సరే... ముందు ఈ ప్రశ్నలన్నీ ఎక్కడి నుండి ఎందుకు పుడుతున్నాయో నీకు తెలుసా?

ఎవరో ప్రశ్నించినట్లనిపించింది. ప్రశ్నలకు సంబంధించిన మౌలికమైన ప్రశ్న... కానీ జవాబు దొరకలేదు.

బస్సు కిటికీ అవతలి చీకట్లోని అడవివైపు మరింత స్పష్టంగా చూడడానికి ప్రయత్నించాను.

*

చింతపల్లిలో మధ్యాహ్నం భోజనమయ్యాక ఆ ఊరి చివరిరోడ్డు కిరువైపులా జరుగుతోన్న వారాంతపు సంత దగ్గర బస్సు ఆపి ఏదో కొనుక్కోడానికి దిగాడు డ్రైవర్.

కిటికీలోంచే నా పరిధి మేరకు కనిపిస్తోన్న బయటి ప్రపంచాన్ని కాసేపు పరిశీ లించాను.

అటవీ ఉత్పత్తులైన చింతపండు, కుంకుళ్లు, తేనెలాంటివి అమ్ముతున్న దుకాణాలు, కొత్తవీ పాతవీ బట్టలు అమ్ముతున్న దుకాణాలు, చవకబారు సబ్బులు, పౌడర్లు అమ్ముతున్న దుకాణాలు, కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు అమ్ముతోన్న దుకాణాలు...

అన్నింటిదగ్గరా జనం గుమిగూడి ఉన్నారు. అంతా సందడిగా ఉంది. ఉన్న ట్లుండి జనం మధ్యలో ఏదో కలకలం.

ఎవరిదో చేతిసంచీ గాల్లోకి ఎగిరింది. అందులో ఉన్న సరుకులన్నీ గాల్లోనే చెల్లాచెదురయ్యాయి.

ఎవరో వృద్ధుడు... సుమారు డెబ్భై ఏళ్లు పైబడిన వయసుంటుంది. జనం మధ్యలోంచి పరుగెత్తుకుంటూ వస్తున్నాడు.

జనమంతా ఈ హఠాత్ సంఘటనకు విస్తుబోతూ పక్కకి జరుగుతూ దారి ఇస్తున్నారు. ఆ వృద్ధుడి పెదవుల్లోంచి రెండే రెండు పదాలు పదే పదే వినబడుతున్నాయి.

"వేరే ఉంది... ఇది కాదు - ఇది కాదు... వేరే ఉంది," అవీ ఆ పదాలు.

అతడి వేషధారణ చూస్తే- శుభ్రమైన ఇస్త్రీ చేసిన ప్యాంటూ షర్టులో, నూనెపెట్టి దువ్విన క్రాపుతో, రిస్ట్ వాచీతో, జేబులో పెన్నుతో రిటైర్డ్ స్కూల్ హెడ్‌మాస్టర్‌లా ఉన్నాడు.

జనం ముఖంలోని ఆశ్చర్యాన్ని బట్టి అతడు వున్నట్లుండి- ఇప్పుడే- ఈ సంతలోనే మొదటిసారిగా అలా ప్రవర్తించడం మొదలుపెట్టాడు అన్నట్లుగా తెలుస్తోంది.

అతడు పరుగెత్తుకుంటూ వస్తూనే చేతికున్న గోల్డ్ కలర్ రిస్ట్‌వాచీ తీసి అవతలికి విసిరేశాడు.

బయటి జనమే కాకుండా మా బస్సులోని సహ ప్రయాణీకులందరూ కిటికీలు పూర్తిగా తెరిచి- నిలబడి అటువైపే చూస్తున్నారు.

అలా పరుగెత్తుకుంటూ దాదాపు మా బస్సు సమీపానికి చేరి తక్కున ఆగాడు.

పదేళ్ల వయసున్న కోయపిల్ల రోడ్డు పక్కన నిలబడి సారకాయలు అమ్ముకుంటోంది.

అతడు ఆ పాప దగ్గర ఆగి- ఆమెవైపు కదిలి వంగి ఆ పాప బుగ్గమీద ముద్దు పెట్టి, 'ఇది కాదు... వేరే ఉందిరా తల్లీ,' అంటూ ఆమె చేతిలోని సారకాయ తీసుకొని చేత్తో గుండ్రంగా తిప్పుతూ, తను కూడా గుండ్రంగా తిరుగుతూ, 'హు...హ్వా హ్వా,' అని కాసేపు కేరింతలు కొట్టి తిరిగి సారకాయను ఆమె చేతిలో పెట్టి- ఏదో గుర్తుకొచ్చి నట్లుగా ఆగి-

తన ప్యాంటుజేబులోంచి మనీపర్స్ తీసి, అందులోని నోట్లన్నీ బయటికి లాగి, పర్స్ అవతలికి విసిరేసి, డబ్బులన్నీ ఆ పాప చేతిలో కుక్కాడు. విస్తుపోయి చూస్తోంది ఆమె. చుట్టూ ఉన్న వాళ్లందరి హావభావాలు కూడా అలాగే ఉన్నాయి.

అతడు మళ్లీ అన్ని జేబులూ వెతికి, చేతికి దొరికినన్ని చిల్లర పైసలు బయటికి తీసి గాల్లోకి విసిరాడు.

ఒక నాణెం ఎగిరొచ్చి మా బస్సుమీద పడింది. ఒక్క కుదుపుతో బస్సు కదిలింది.

ఉలిక్కిపడ్డాను. చప్పున కల చెదిరింది. కళ్లు తెరిచి చూశాను. బస్సు స్పీడ్ బ్రేకర్‌ని దాటుతోంది. విచిత్రమైన కల... స్పీడ్‌బ్రేకర్ కుదుపు లేకపోతే కల ఇంకా అలాగే కొనసాగేదేమో...? ఆ తర్వాత కలలో ఆ వృద్ధుడు ఇంకా ఏం చేసేవాడో... ఏం చెప్పేవాడో... తెలుసుకునే అవకాశం ఎప్పటికీ లేదు.

అసలు ఏ కల ఎక్కడ తెగుతుందో ఎవ్వరికీ తెలియదు. జీవితం... కలలోని కల అనిపిస్తుంటుంది ఒక్కోసారి. అలా అనిపించినప్పుడు అంతా మబ్బులా... విడిపోయినట్లూ, ఎంతో తేలికై పోయినట్లూ చింతించడానికి పెద్దగా ఏంలేదు అన్నట్లు అనిపించి హాయిగా ఉంటుంది.

అదీ కొన్ని క్షణాలు... లేక కొన్ని నిమిషాలు... అంతే. మళ్లీ పొగ కమ్మినట్లు... చవకబారువి ముఖ్యమైపోవడాలు- మహదానందం కలిగించేవి మరుపున... మరుగున పడిపోవడాలు- ఇలా ఉంటే బావుండునను టకోవడాలు- ప్చ్‌లూ- రోజుకింత మాంసం తిని రక్తం తాగి బలిసిపోయే మనసుని మోయలేక మోయలేక అలసిపోవడాలు...

దీని గురించి కూడా ఆయన్తో మాట్లాడాలి.

తాగడం పూర్తి చేసిన కాఫీకప్పుని టేబుల్ మీద పెట్టబోతూ ఏం చెప్పడానికి ఉద్యుక్తుడవుతాడో చూడాలి.

కిటికీలోంచి బయటికి చూశాను.

ఎండిపోయిన సారకాయ బుర్రలతో కలిసి శీతాకాలపు మధ్యాహ్నపుటెండలో ఆబగా చలి కాగుతున్న గుడ్డి గుడిసెల గూడేన్నేదో వేగంగా దాటుతోంది బస్సు.

*

ఇరవయ్యో నెంబర్ సిటీబస్సు దిగి నడుచుకుంటూ బస్టాపుకి దగ్గర్లోనే వున్న ఆ హోటల్‌కి చేరుకోబోతూ దానిముందు కాసేపు నిలబడ్డాను.

పాతకాలంనాటి నిర్మాణం. ఈ హోటల్లో కూర్చునే కదా ఆయన కాఫీ తాగుతూ ఎదురుచూసేది.

ఉత్తరంలో రాసిన ఉత్త గోధుమరంగు వేడి ఊహ... ఉన్నిథన్‌లు... ఇక్కడే కదా...

నాకు- చుట్టూ రంగుల ప్రపంచం మధ్యలో నిలబడి బ్లాక్ అండ్ వైట్ ఫోటోని చూస్తున్నట్లని పించింది.

హోటల్ వైపు కదులుతూ వాచీలో టైం చూశాను. నాలుగూ నలభై ఏడు... శీతాకాలపు సాయంత్రపు చల్ల గాలి అప్పుడే చర్మాన్ని పలకరించడం మొదలుపెట్టింది.

హోటల్లోకి అడుగుపెట్టి నాకు కావలసిన సీటు కోసం చూశాను.

చివర్లో కుడివైపు కిటికీ పక్కన టేబుల్ కనిపిం చింది. కానీ కుర్చీలు ఖాళీగా ఉన్నాయి.

ఆయన హోటల్‌కి రాలేదా...? వచ్చి వెళ్లిపో యాడా...? వస్తాడా...?

అక్కడ కూర్చుంటేనే కిటికీలోంచి బస్‌స్టాప్ కనిపి స్తుంది. ఖచ్చితంగా ఆయన కూర్చునే స్థలం అదే... అను కుంటూ అటువైపు కదిలాను.

పాతకాలపు చెక్కటేబులు, కుర్చీలు... వెనుక గోడకి ఆనించి వేసిన కుర్చీలో కూర్చున్నాను.

ఎడమవైపు కిటికీలోంచి బయటి ప్రపంచం కనిపి స్తోంది.

ఎదురుగా ఆరు టేబుళ్ల కవతల కౌంటర్‌కి ఎడం వైపున ముఖద్వారం.

సాయంకాలపు ఎండ బయటి నుండి సగం కౌంటర్ మీద పడుతోంది.

కౌంటర్లో కూర్చున్న వ్యక్తి వెనుకగోడ మీద దండ తో ఎవరిదో నవ్వుతూ ఉన్న వ్యక్తి ఫోటో ఉంది. ఈ హోటల్ వ్యవస్థాపకుడు అయి ఉండొచ్చు.

కాసేపటికి పొడుగ్గా బక్కపలుచగా ఉన్న సుమారు ఇరవై అయిదేళ్ల యువకుడు స్టీలు జగ్గులో నీళ్లతో వచ్చి టేబుల్ మీద ప్లేట్లో బోర్లించి ఉన్న గ్లాసు తీసి నీళ్లు నింపుతూ-

"ఇంత చివర్లో కూర్చున్నారేటండీ. ఎదర ఖాళీగా ఉందిగా," అన్నాడు.

"ఇక్కడే బాగుంది నాకు. కిటికీ పక్కన... దీని అవ తలి ప్రపంచానికి ఇవతల," చివరి వాక్యం మనసులోనే అనుకొని, "నీ పేరేమిటి?" అనడిగాను.

"పైడితల్లండీ," చెప్పాడతను. ఉన్నిథన్ ఎక్కడి కెళ్లాడో...? మానేసి ఉంటాడా? లేక ఈరోజు డ్యూటీకి రాలేదా...?

"ఉన్నిథన్ రావడం లేదా...?"

"ఎవరూ... మధ్యలో కొన్నాళ్లు ఆగిపోయిన ఈ హోటల్‌ని కొని తిరిగి ప్రారంభించిన ఒకప్పటి ఈ హోటల్ సర్వర్ ఉన్నిథన్‌గారినేనా మీరడుగుతుందీ..." అని, కౌంటర్ వెనుక కనిపిస్తోన్న ఫోటోవైపు వేలు చూపిస్తూ-

"ఆయనేనా," అన్నాడు పైడితల్లి.

కౌంటర్ మీద పడుతోన్న సూర్యాస్తమయపు ఎండ- వెనుక గోడమీద సృష్టిస్తోన్న వెలుతురులో- ఫోటో లోంచి ఉన్నిథన్ నవ్వుతున్నాడు.

ఉన్నిథన్ వెళ్లిపోయాడా? సర్వర్‌గా మొదలుపెట్టి ఒక్కో మెట్టూ ఎక్కి... చివరికి అన్ని మెట్లనూ రద్దుచేసి-

మెల్లగా బ్యాక్‌వాటర్స్‌లో బరువుగా సాగే పడవ లో... బ్యాక్‌కి... వెనక్కి... వెనక్కి వెళ్లిపోయాడా?

"ఏం చెప్పమంటారు? రవ్వదోసె, మసాలాదోసె, ఊతప్పం... చపాతీ," పైడితల్లి అడుగుతున్నాడు.

బ్యాక్‌వాటర్స్‌లోంచే తలతిప్పి, "ఆ..." అని, "రవ్వదోసె," అన్నాను. పైడితల్లి వెళ్లిపోయాడు- రవ్వ, మైదా, బియ్యంపిండి మధ్యలో అతి చిన్నచిన్న శూన్యాల్ని సృష్టించి ప్లేట్లో పట్టుకురావడానికి. స్టీలు గ్లాసులోని నీళ్లు తాగి నింపాదిగా ఒకసారి హోటల్‌నంతా పరికించి చూశాను.

టేబుళ్లూ, కుర్చీలు, కిటికీలు, కౌంటర్ పాతవే అయినా ఫ్యాన్లు, లైట్లు, ఫ్లోరింగ్ కొత్తవి, పాతకొత్తల మేలుకలయికలా.

ముఖద్వారం వైపు చూశాను ఆయనొస్తున్నాడేమో నని. వృద్ధజంట ఒకటి అప్పుడే లోపలికి అడుగుపెడు తోంది. దోసెలే తింటారో, కాఫీలే తాగుతారో... ఈ శీతా కాలపు సాయంకాలం గతస్మృతులే చప్పరిస్తారో...?

కిటికీలోంచి చల్లగా గాలి వీచింది. తలతిప్పి అటువైపు చూశాను.

కొంచెం దూరంలో బస్టాపు కనిపిస్తోంది. కాసేపటి క్రితం నేను సిటీబస్సు దిగిన స్థలం.

స్వెట్టర్ వేసుకున్న పోనీటెయిల్ యువతి హై హీల్స్‌లో అటువైపు నిలబడి బస్సుకోసం ఎదురు చూస్తోంది.

ఆమెకు కొంచెం కుడిపక్కగా బస్టాపులో వేసిన స్టీలు కుర్చీల్లో ముగ్గురు ప్రయాణీకులు కూర్చొని ఉన్నారు. ఒక కుర్చీ ఖాళీగా ఉంది. కాసేపటికి సిటీ బస్సు వచ్చి ఆగింది. బస్సులోంచి ఎవరూ దిగలేదు.

ఈ శీతాకాలపు సాయంత్రం... ఈ సూర్యాస్త మయపు వేళలో... ఆ యువతి మాత్రం హైహీల్స్‌తో ఆ

ప్రదేశపు భూగోళం మీద నాలుగడుగులు నమోదు చేసి బస్సెక్కి వెళ్లిపోయింది.

అప్పటిదాకా ఆమె నిల్చున్న స్థలాన్ని తిరిగి శూన్యం భర్తీ చేసింది.

ఆయనెలా వస్తాడో హోటల్‌కి. ఇల్లు దగ్గర్లోనే ఉన్నట్లయితే నడుచుకుంటూనా? కొంచెం దూరం అయితే స్కూటర్ మీదా? చాలాదూరం అయితే సిటీ బస్సులోనా? అసలు ఈమధ్య వస్తున్నాడా? తప్పకుండా వస్తాడు. 'రోజూ మధ్యాహ్నమో, సాయంత్రమో అలా వచ్చి ఈ హోటల్లో కూర్చొని ఎదురుచూడడం ఇష్టం నాకు,' అని హోటల్లో కూర్చునే ఆయన రాసిన ఉత్తరం లోని వాక్యం గుర్తొచ్చింది.

అయినాసరే పైడితల్లిని అడిగితేపోలా అనిపించిందో క్షణం. ఒద్దు. దానివల్ల నా కాల్పనిక విస్తృతి యొక్క పరిధి కుంచించుకుపోయే అవకాశం ఉంది.

రవ్వదోసె తెచ్చిపెట్టాడు పైడితల్లి. శూన్యాల్ని చట్నీలో, సాంబారులో నంజుకోసాగాను.

తింటూనే తలెత్తి కౌంటర్ వెనుక ఉన్నిథన్ ఫోటో పక్కనున్న గుండ్రని నలుపూ తెలుపుల గోడ గడియారం వైపు చూశాను. పావు తక్కువ ఆరు.

మెల్లిగా హోటల్లోకి జనసంచారం పెరిగింది. ఆయన హోటల్లో అడుగుపెట్టి, అలవాటైన ఈ టేబుల్ వైపే వచ్చి సాలోచనగా, "మీరూ..." అని నా పేరు అడుగుతాడా?

లేక అదేం పట్టించుకోనట్లుగా ఎదురు సీట్లో కూర్చొని కాఫీ ఆర్డరిచ్చి, 'ఈ ఎదురుగా ఉన్నవాడు తొందరగా వెళ్లిపోతే బాగుండును. తన ఏకాంతపు ఎదురుచూపుల్లో తను మునిగిపోవచ్చు,' అని అనుకుంటాడా?

ఆయన రాసిన ఉత్తరంలో ఒక వాక్యం మధ్యలోంచి 'ఉండడం' అనే పదంలో చివరిదైన సున్నా అనే అక్షరాన్ని గమ్మత్తుగా... ఒకవైపుకి వంచి ఆయన రాసిన తీరుని చూస్తే-

ఆయనతో నిస్సంకోచంగా కరచాలనం చేయవచ్చనిపిస్తుంది.

పొద్దునెప్పుడో బయటికి వెళ్లి తిరిగి చీకటిపడేవేళకి పొగమంచులోంచి తిరిగి వస్తోన్న మనిషి కోసం- హిల్ స్టేషన్ మీది రాత్రి గదిలో బ్యాగ్‌లో ఒంటరిగా ఎదురు చూస్తున్న పొడవాటి సీసాలోని ద్రాక్షతోటల దారులు కన్న కలల గురించీ-

మూడోరోజు ముసురులో కూడా చీకటి కిటికీ పక్కనే ఏకాంతంగా కూర్చొని వెనుక వెళ్లిపోయిన స్కూల్ గోడల నీడల గురించీ, ఉద్విగ్న సౌందర్యపు క్షణాల కారణాల గురించీ, రక్తంలో పూలు పూయించిన పొడవాటి రాత్రుల్ని తల్చుకున్నపుడు పుట్టిన దిగులు గురించీ, హఠాత్తుగా క్షణకాలంలో అనుభవంలోకి వచ్చిపోయిన 'ఉనికి' తాలూకు స్పృహ మిగిల్చిపోయిన కొన్ని రోజుల నిశ్శబ్దాన్ని గురించీ-

మండుతోన్న ఒక మే నెల మధ్యాహ్నపుటెండలో ఆటో దిగి పరిగెత్తుకుంటూ రైల్వే ప్లాట్‌ఫాం చేరుకొని- కదులుతోన్న పాసింజెర్ రైలుని అతికష్టం మీద అందుకొని- క్రిక్కిరిసిన జనంలో డోర్ దగ్గరే వేడి నిట్టూర్పుల ప్రయాణం కొనసాగిస్తున్నపుడు- బయట వడగాడ్పుల వెండి ఎండలో- గంట తరువాత బీడుభూముల కవతల పొలం గట్టుపైన కనిపించిన చింతచెట్టు నీడ... కళ్లకు కలిగించిన ఆహ్లాదాన్ని- మిగిలిన ప్రయాణమంతా, 'నా నీడపట్టున హాయిగా సేదతీరుతూ ఈ ఋతువునంతా గడిపేయక ఎందుకు మీ అందరికీ ఈ ఎండాకాలపు ప్రయాణాలు, ఇనుప వడగాడ్పులు,' అని రాత్రెప్పుడో రైల్లో నిద్రపోయేంత వరకూ వెంటాడిన ఏ చింతాలేని ఆ చింతచెట్టు జ్ఞాపకాన్ని గురించీ-

ఇలా అనేకం ఆయన్తో పంచుకోవచ్చనిపిస్తుంది.

పైడితల్లి నీడ ట్యూబ్‌లైట్ వెలుతురుని అడ్డగించి నామీద పడింది.

తలపైకెత్తి, "టీ చెప్పు," అన్నాను. టేబుల్ క్లీన్ చేసేవాడిని కేకేస్తూ వెళ్లిపోయాడు.

కిటికీలోంచి మళ్లీ చల్లగాలి... బయట ప్రపంచంలో కూడా దీపాలు వెలిగాయి. వీధిలో జనసంచారం పెరిగింది.

ఒక వీధిదీపం కింద రాజస్తానీ ఛాట్‌భండార్ చక్రాల బండి ముందు జనం గప్‌చుప్‌లూ కట్‌లీసులూ అప్పుడే చుట్టుముడుతోన్న చలితో కలిపి నములుతున్నారు.

బస్టాపు ముందున్న రోడ్డుకవతల కళ్లు జిగేల్‌మనిపించే దీపకాంతులతో షాపింగ్‌మాల్ ఒకటి మనుష్యుల కొనుగోలు శక్తివైపు చూపులు సారించి నిలబడి వుంది.

ఇంకో వీధిదీపం కింద కళ్లులేని కబోది ఒకడు బొచ్చెను శబ్దం చేయిస్తూ అడుక్కుంటున్నాడు.

కిటికీ పక్కనే ఉన్న రోడ్డు కవతలి గోడ మలుపులో చీకటిగా ఉన్నచోట పాదచారి ఒకడు ఆగి సినిమా పోస్టర్ మీద ఉచ్చ పోస్తున్నాడు.

ఒక వృద్ధుడు పెంపుడుకుక్కతో ఈవినింగ్ వాక్ చేస్తూ కిటికీ దాటుతున్నాడు.

ఆయన ఇంటి నుండి బయలుదేరి ఉంటాడా? దార్లో ఉండి ఉంటాడా? లేక బయటికెళ్లే కార్యక్రమాలన్నీ రద్దు చేసుకొని ఇంట్లో క్రాస్‌వర్డ్ పజిల్స్ నింపుతూ కాలక్షేపం చేస్తూ ఉండి ఉంటాడా?

ముఖద్వారం వైపు చూశాను. ఎవరో బిల్ పే చేసి బయటకు వెళ్తున్నారు.

కౌంటర్ వెనుక ఫోటో మీదికి దృష్టి మరలింది. ఉన్నిథన్ నవ్వుతున్నాడు- కౌంటర్ మీది రేడియోలోంచి సాయంకాలపు వార్తలు వింటూ.

ఒకవేళ ఆయన ఈరోజు హోటల్లో కలవకపోతే ఏంచేయాలి? రేపు కూడా వచ్చి వెయిట్ చేసి చూడాలా?

లేక తెల్లవారుఝామునే ఊరికి బయలుదేరే బస్సులో తిరిగి వెనక్కి వెళ్లిపోవాలా?

అసలెందుకు రావడం- ఎందుకు పోవడం?

అయితే... ఇలా రావడంవల్లే కదా... చింతపల్లి సంతలోని వృద్ధుని కల కనగలి గింది.

తిరిగి వెనక్కి వెళ్తున్నపుడు మళ్లీ ఏ కల వస్తుందో?

ఊరికి చేరుకొని- మర్నాడు తిరిగి ఆఫీసుకి అటెండయ్యి- సాయంత్రం ఏకాంతంగా పార్క్‌కి చేరుకొని-

ఆ రెండు కలల్ని కలిపి అంతఃస్సూత్రం ఏదైనా కనిపిస్తుందేమోనని వెదికి దొరికితే ఆ ప్రయత్నానికి సంబరపడి- దొరక్కపోతే ఆ వ్యర్థ ప్రయత్నానికి నాలో నేనే నవ్వుకొని...

టీ తెచ్చి టేబుల్ మీద పెట్టాడు పైడితల్లి. చేతిలోకి తీసుకొని గ్లాసుని పైకి లేపాను. తేయాకు- ద్రవరూపపు పెదవుల్తో వెచ్చగా ముద్దు పెట్టుకుంది.

తాగడం పూర్తిచేసి గోడ గడియారంవైపు చూశాను. ఏడున్నర అవుతోంది- ఉన్నిథన్ నవ్వుకి పక్కన.

కిటికీలోంచి బయటికి చూశాను. పల్చటి పొగమంచు బస్టాప్‌ని కమ్ముకుంటోంది.

వీధి దీపం చుట్టూ చేరిన పురుగులు, 'అడుగుతుంటే చెప్పవేం... మా ఉనికికి అర్థమేవిటీ?' అని దీపాన్ని నిలదీసి అడుగుతున్నాయి- అంతలోనే ఒకటి రెండు ఇసుకలా రాలిపోతూ.

ఛాట్‌భండార్ విజయవంతంగా ఆడుతోంది. బస్టాపులో ఎవరో ఆటో ఎక్కుతున్నారు.

ఎవరైనా ఆటో దిగితే బాగుండు- ఆయనేమోనని గుమ్మం వైపు ఎదురు చూపులు నిలిపేవాడిని కాసేపు.

చూపుల్ని కిటికీలోంచి లోపలికి తిప్పి చుట్టూ ఉన్న ప్రపంచం వైపు చూశాను. ఎవరి ప్రపంచంలో వారున్నారు.

నా ప్రపంచంలో నేనుండిపోయి గమనించలేదు. కానీ- నా చుట్టూ ఉన్న టేబుళ్ల దగ్గర జనం కూర్చొని చాలాసేపటి నుండి టిఫిన్లు చేస్తూ టీ కాఫీలు తాగుతూ గట్టిగానే మాట్లాడుకుంటున్నారు.

ఒక్కసారిగా వాస్తవ ప్రపంచంలోకి అడుగు పెట్టినట్లయింది. జస్ట్ ఫర్ ఛేంజ్ అన్నట్లుగా ఆయనొచ్చే వరకూ కాలక్షేపం కోసం వాళ్ల సంభాషణల్ని వినడానికి ప్రయత్నించాను.

నా టేబుల్ వెనక కూర్చున్న ఇద్దరు వ్యక్తుల్లో ఒకాయన ఏదో ఆఫీసులో డిపార్ట్‌మెంట్ హెడ్‌లా వున్నాడు. ఆ ఆఫీసు మొత్తం నడవడానికి తనొక్కడే కారణమైనట్లూ, మిగతా స్టాఫ్ అంతా పనిదొంగలూ సోమరిపోతులూ అయినట్లు ఊతప్పం తింటూ పక్కవాడితో ఊదర గొడుతున్నాడు.

నా టేబుల్‌కి కుడిపక్క ఇద్దరు యువకులు చపాతీ తింటూ కబుర్లు చెప్పుకుంటున్నారు. వాళ్లలో కూడా ఒకడే మాట్లాడుతుంటే మరో యువకుడు వింటున్నాడు.

మాట్లాడుతోన్న యువకుడి మాటల్ని బట్టి అతడు కొత్తగా ప్రేమలో పడ్డట్టు తెలుస్తోంది.

నా చెవులకి వినిపించినంత మేరా ఆ టేబుల్ మీది వ్యక్తీ, ఈ టేబుల్ మీది యువకుడూ మాట్లాడుకుంటున్న మాటల్ని వినసాగాను.

ఇలా జనం మధ్యలో ఉన్నప్పుడు వాళ్లు మాట్లాడుకునే మాటల్లోని విషయాల కన్నా- వాళ్ల మాటల్లోంచి ఎంత తరచుగా 'నేను' అనే పదం వ్యక్తమవుతుందో గమనించడం పట్ల ఆసక్తి ఎక్కువ నాకు. అదొక గేమ్‌లా ఉంటుంది.

ఆ టేబుల్ మీది నుండి, ఈ టేబుల్ మీది నుండి వెంట వెంటనే దూకుతోన్న 'నేను' అనే పదం యొక్క వేగాన్ని ఆస్వాదిస్తూ కాసేపు అలా ఉండిపోయాను.

ఉన్నట్టుండి డిపార్ట్‌మెంట్ హెడ్ స్వరం పెంచి, 'నేను గనక లేకపోతే...' అనగానే వెంటనే-

ఇట్నుండి ప్రేమలో పడ్డ యువకుడి నోట్లోంచి, 'ఆ ఆనందమే వేరు,' అన్న వాక్యం చటుక్కున వినిపించింది.

మెరుపు వేగంతో అసంకల్పితంగా సంభవించిన ఆ చమత్కారానికి ఫక్కున నవ్వొచ్చింది నాకు.

వాళ్లెవరైనా ఈ విషయాన్ని గమనించి ఉంటారా అనుకొని రెండు టేబుళ్ల వైపూ చూశాను. హోటల్లోని రణగొణధ్వని వల్ల వాళ్లు ఈ చమత్కారాన్ని గమనించి

నట్లు లేరు. వాళ్లిద్దరి మధ్యలో ఉన్న నాకు తప్ప వాళ్ల మాటలు ఒకరికొకరికి వినిపించే అవకాశం కూడా లేదు.

దీనికి 'లాఫింగ్ ఫిలాసఫీ' అని పేరు పెడితే ఎలా ఉంటుంది అనిపించింది. తెలుగులో అయితే- చమత్కార వేదాంతం.

కిటికీలోంచి చల్లగాలి ఈసారి బలంగా వీచింది. బయట పొగమంచు.

వస్తువుల్లోంచి... మనుష్యుల్లోంచి... వాళ్ల మాటల్లోంచి... వాళ్ల మధ్యన ఖాళీల్లోంచి...

ఆయన పొగమంచుకి అవతల ఉన్నాడా? నిజానికి పొగమంచు మధ్యలోనే ఉండి ఉంటాడు ఎక్కడున్నా.

కాని దానికి అవతల ఉన్నాడేమో అనుకోవడంలోనే మరొక టీగ్లాసులోని గుండ్రని వేడికి సార్థకత... ఇంకో టీ చెప్పాను. బిజీగా ఉన్నట్లున్నాడు- చాలాసేపటి తర్వాత తెచ్చిచ్చాడు పైడితల్లి.

టీ తాగుతుంటే చూపులు ఉన్నిథన్ ఫోటో మీదికి వెళ్లాయి.

ఉన్నిథన్ చివరిశ్వాస ఎక్కడ తీసుకొని వుంటాడు. ఈ ఊళ్లోనా? కేరళ్లోనా? అతడి తలలోని చివరి స్మృతి ఏమై ఉంటుంది? అతడి పెదవుల మీద ఆఖరి పదం ఏమిటో...?

ఉన్నిథన్ చివరిశ్వాసతో... ఉన్నిథనే కాదు భూమ్మీది ఏ జీవి చివరిశ్వాసతోనైనా అంతరిక్షంలోని ఏ ఇతర కదలికకైనా సంబంధం ఉండి ఉంటుందా? ఎవరు చెబుతారు?

ఆయనొస్తే బాగుండు. ఇవన్నీ మాట్లాడుకోవచ్చు. టైం చూశాను. చూస్తూ చూస్తూనే దాదాపు తొమ్మిదయిపోయింది. హోటల్ మూసేయడానికి ఇంకా గంట టైం ఉంది.

ఏదడిగినా అడక్కపోయినా ఆయన్ని తప్పకుండా అడగాలనుకున్న ఆ ఒకే ఒక్క ప్రశ్న గుర్తొచ్చింది. వెంటనే పెదవుల మీదికి నవ్వొచ్చి వాలింది. ఇక దాని అవసరం లేదు.

కుర్చీలోంచి లేస్తూ పైడితల్లి కోసం చుట్టూ చూశాను. అతను కనిపించలేదు. ఎవరికి చిన్నచిన్న శూన్యాల్ని సృష్టించి ప్లేట్లో పెట్టుకొని తేవడానికి లోపలికి వెళ్లాడో?

సాయంత్రం నుండి అప్పటిదాకా కూర్చున్న టేబుల్ దగ్గర్నుండి కదిలి కౌంటర్ దగ్గరికెళ్లి బిల్ పే చేశాను. మిగిలిన చిల్లర పైడితల్లికి ఇవ్వమని చెప్పాను.

మరోసారి ఉన్నిథన్ ఫోటోని దగ్గర్నుండి చూడాలనిపించింది. అతడు ఇంకా నవ్వుతూనే ఉన్నాడు.

కౌంటర్ మీది రేడియోలోంచి వాతావరణ వివరాలు ప్రసారమవుతున్నాయి. 'రాగల ఇరవై నాలుగ్గంటల్లో...' అని వినిపించగానే తలెత్తి క్యాష్ కౌంటర్లో కూర్చున్న వ్యక్తి కేసి చూసి-

'రాగల ఇరవై నాలుగ్గంటల్లో ఏ క్షణమైనా పోగలం... ఈ వాస్తవం ముందరి అద్భుతాన్ని బలంగా తెలుసుకున్న మనిషి కళ్లల్లోంచి కారిన కన్నీరే- ఇప్పటి వరకూ ఈ భూమ్మీద అత్యధిక వర్షపాతంగా నమోదైంది... అని రేడియో వాతావరణ విశేషాల్లో ఏమైనా ఒక్కసారి కూడా చెప్పరేవండీ?' అనాలనుకున్నాను.

కానీ బయట ఆకాశం కింద కూడా అనంతమైన కాల్పనిక వేడుక నాకోసం ఎదురుచూస్తూ ఉంటే-

మాటల్తో కాలాన్నెందుకు వృధా చేయడం అనుకొని- హోటల్లోంచి బయటి కొచ్చేశాను.

*24.5.2014న ప్రఖ్యాత కథారచయిత 'త్రిపుర' ప్రథమ వర్ధంతి సందర్భంగా...*

***ఆదివారం ఆంధ్రజ్యోతి, 25 మే 2014***

